క్లుప్తంగా

ప్రభుత్వ నిర్ణయంపై అర్చకుల హర్షం

ఫిరంగిపురం: రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో పనిచేసే అర్చకులకు పదవీ విరమణ లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కె.సత్యనారాయణలు నిర్ణయం చేయడంపై ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు తూమాటి మురళి హర్షం వ్యక్తం చేశారు. ఫిరంగిపురంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్చకుల బాగోగుల విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ధూప దీప నైవేద్యం కోసం పలు ఆలయాల అర్చకులకు నెలనెలా పారితోషికం చెల్లించడం త్వరలో దానిని పెంచేందుకు తీసుకున్న నిర్ణయాలు హర్షనీయమని చెప్పారు. జీవోలు అమలు చేసేందుకు ఎంతో కృషి చేసిన అర్చక సమాఖ్య నాయకులు ఎ.ఆత్రేయబాబు, పి.రాంబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అర్చకులు పాల్గొన్నారు.

టిఫిన్ బండి అందజేత

మంగళగిరి: నగరంలోని భార్గవపేటకు చెందిన జంజనం శాంతి–రమేష్ దంపతులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో టిఫిన్ బండిని అందజేశారు. కార్యక్రమంలో చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు,పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు..

మంగళగిరి: అనారోగ్యంతో బాధపడుతున్న బేతపూడి బాపూజీనగర్‌కు చెందిన బేతపూడి అనంత పునీతకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) శుక్రవారం స్థానిక నాయకుల ద్వారా రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బేతపూడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదో తరగతి విద్యార్థి అదృశ్యం



మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని కాజకు చెందిన ఐదో తరగతి విద్యార్థి అదృశ్యమయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కాజ పుల్లయ్యనగర్‌కు చెందిన షేక్ కరీముల్లా, జరీనా దంపతుల కుమారుడు ఫిరోజ్ (12) ప్రతి రోజూ మాదిరి గురువారం ఉదయం స్కూలుకు వెళ్లి సాయంత్రం ఐదు గంటలకు తిరిగి ఇంటికి వచ్చాడు. స్నేహితులతో కలసి ఆటలాడుకునేందుకు బయటకు వెళ్లిన ఫిరోజ్ తిరిగి ఇంటికి రాలేదు. తల్లి జరీనా తన కుమారుడు ఫిరోజ్ అదృశ్యమైనట్లు మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ అసిస్టెంట్ నివాస గృహంలో చోరీ

మంగళగిరి: ఏపీ మహిళా కమిషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి నివాస గృహంలో చోరీ జరిగింది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధి కాజకు చెందిన తోకల హరిబాబు ఏపీ మహిళా కమిషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం 10 గంటలకు డ్యూటీకి బయలుదేరి వెళ్లిన హరిబాబు అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. తలుపులకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండటంతో గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని సుమారు 10 గ్రాముల బంగారం, నగదు మాయమైంది. బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.80 లక్షలతో చెత్త సేకరణ వాహనాలు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని చెత్తను సేకరించేందుకు కార్పొరేషన్ అధికారులు శుక్రవారం రెండు చెత్త సేకరణ వాహనాలను కొనుగోలు చేశారు. డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆర్కే ఆదేశాల మేరకు, కమిషనర్ శారదాదేవి సూచనల మేరకు తాడేపల్లి, మంగళగిరి పట్టణాల్లో చెత్త సేకరణకు రెండు వాహనాలు కొనుగోలు చేశామని, వీటి విలువ సుమారు రూ.80 లక్షలు ఉంటుందని, సోమవారం నుంచి ఈ వాహనాలు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. వాహనాల్లో చెత్త సేకరించి నేరుగా చిలకలూరిపేట వద్ద ఉన్న డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తామని, గతంలో కొనుగోలు చేసిన వాహనాల్లో 10 టన్నులు మాత్రమే చెత్త పడుతుందని, ప్రస్తుతం కొనుగోలు చేసిన వాటిలో 14 టన్నుల వరకు చెత్తను సేకరించవచ్చని డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

ఈద్గాకు గ్రావెల్ తోలకం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెనుమూలిలోని ఈద్గాకు మెరక వేయాలని ముస్లింలు కోరడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే ఈద్గాలో మెరక తోలే పనులు చేపట్టారు. ఇప్పటికే ఈద్గాలో సగానికిపైగా మెరక పూర్తయిందని వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్ తెలిపారు. ఎమ్మెల్యే ఆర్కేను స్థానిక ముస్లిం సోదరులు అడిగిన వెంటనే ఈ పనులు చేపట్టారని, రెండుమూడు రోజుల్లో ఈ పనులు పూర్తికానున్నట్లు ఆయన తెలిపారు.

కరోనా బాధితులకు అండగా నిలిచిన వలంటీర్

వలంటీర్లకు వందనం



కూరగాయలు అందజేస్తున్న వలంటీర్ మస్తాన్‌షరీఫ్(ఫైల్)

ఫిరంగిపురం: కోవిడ్ సమయంలో పాజిటివ్ వచ్చి ఇంటికే పరిమితమై ఎవరూరాని సమయంలో పిలిచినంతనే ఇంటికి వచ్చి వారంరోజులపాటు రెండు కుటుంబాలవారికి వలంటీర్ కూరగాయలు, మందులు అందజేశారు. మండలంలోని మేరికపూడి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన టి.రాజమ్మ, గాయత్రిలకు కోవిడ్ పాజిటివ్ వచ్చింది. వారు ఇంటికే పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న ఆ ప్రాంత వలంటీర్ షేక్ మస్తాన్ షరీఫ్ సంబంధిత ఆరోగ్య సిబ్బందితో వచ్చి పరీక్షలు చేయించి మందులు అందజేశాడు. బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో అవసరమైన కూరగాయలు, కందిపప్పు, నిత్యావసర సరుకులు అందజేశాడు.

ఆపదలో ఆదుకున్న వలంటీర్



కరోనా వచ్చి ఇంటిలోనే ఉంటున్నాం. మమ్మల్ని బయటకు కూడా రానివ్వని పరిస్థితి. మందులు అందజేసేందుకు వచ్చిన వలంటీర్ మస్తాన్ షరీఫ్‌తో మా బాధను చెప్పుకున్నా. వలంటీర్ మాకు నిత్యావసరసరుకులు, కూరగాయలు అందజేశాడు. మందులు ఇచ్చి మాకెంతో ధైర్యం చెప్పాడు. దేవుడు చల్లగా చూడాలి.

–టి.రాజమ్మ.

రాష్ట్రంలో పారదర్శక పాలన జగన్‌తోనే సాధ్యం

- జెడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా
- పలు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం



పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ

ఫిరంగిపురం: రాష్ట్రంలో పారదర్శకపాలన సాగుతోందని అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. మండలంలోని యర్రగుంట్లపాడు, మేరికపూడి గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెనీక్రిస్టినా పాల్గొని మాట్లాడారు. ఏ రాష్ట్రంలో ఇంతవరకు ఎవరూ చేయలేని ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సేవచేశారన్నారు. ఇతర రాష్ట్రాలు మనరాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. ప్రజలకు ఏది అవసరమో గుర్తించి వారికి ఆ పథకాలు అందేలా చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అసైన్డు భూములపై రైతులకు సర్వహక్కులు కల్పించడంపై కృతజ్ఞతలు తెలియజేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, వైస్ ఎంపీపీ జి.చంద్రం, చిట్టా అంజిరెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, ఎం.సుధాకరరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, నరేంద్రరెడ్డి, ఎస్.నాగిరెడ్డి, ప్రసాద్, రాంబాబు, చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వి.పిచ్చిరెడ్డి, పి.వెంకట్రామిరెడ్డి, పి.మల్లేశ్వరి, డి.బ్రహ్మారెడ్డి, కె.హనుమాయమ్మ, కె.వీరారెడ్డి, కె.పద్మావతి, జి.మస్తాన్‌వలి, కె.ఆనంద్, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ అనూరాధ, కార్యదర్శులు కె.విష్ణువర్ధన్‌రావు, టి.వెంకట్రావు, సచివాలయ సిబ్బంది. వలంటీర్లు పాల్గొన్నారు.

తాడేపల్లిలో రూ.1.79 కోట్లతో అభివృద్ధి పనులు



మహానాడు 7వ రోడ్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్



16వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో రూ.కోటీ 79 లక్షల వ్యయంతో పలు ప్రాంతాల్లో శుక్రవారం నూతన పనులను చేపట్టారు. నులకపేట పాపాయమ్మ కొట్టు దగ్గర నుంచి ఫైరింగ్ రేంజ్ వరకు సీసీ రోడ్, డోలాస్‌నగర్‌లోని మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ జాతీయ రహదారి నుంచి యర్రబాలెం సీసీ రోడ్‌వరకు బీటీ రోడ్ నిర్మాణానికి కార్పొరేషన్ నిధుల నుంచి రూ.1.17 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. తాడేపల్లి మహానాడులోని 7వ రోడ్డులో కె.సుశీల ఇంటి వద్ద నుంచి ఎస్‌కె కరీమున్నీసా ఇంటి వరకు రూ.34 లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణం చేపట్టారు. సీతానగరంలో సత్యనారాయణ ఇంటి వద్ద నుంచి ఎం. శ్రీనివాసరావు ఇంటి వరకు రూ.24 లక్షల వ్యయంతో మరో సీసీ రోడ్ నిర్మాణం, 16వ వార్డులో రైల్వేట్రాక్ ప్రహరీ నుంచి తాడేపల్లి మెయిన్ రోడ్ వరకు రూ.4 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించినట్లు కార్పొరేషన్ ఏఈ కిషోర్ తెలిపారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయని వారం పదిరోజుల్లో ఈ పనులు పూర్తి కానున్నట్లు ఆయన తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి పండితుల ఆశీర్వచనం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి వేద ఆశీర్వాదం పలుకుతున్న అర్చకులు

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్చకులకు వరాల జల్లు కురిపించడంతో ఆయన చిత్రపటానికి ప్రత్యేక ఆశీర్వాదాలు అందజేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం సీతాభవనంలో శుక్రవారం అర్చకులు సమావేశం నిర్వహించారు. పలువురు అర్చకులు మాట్లాడుతూ అర్చకులకు వంశపారంపర్యం హక్కులు కల్పించి జీతాలు పెంచి అర్చకుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి కానీ అర్చకులను, వారి బాధలను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. గతంలో పలు ఆలయాలు ధూప, దీప, నైవేద్యాలకు నోచుకోలేదని, అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16 వేల దేవాలయాల్లో దూప, దీప నైవేద్యాలు ఏర్పాటు చేసేందుకు 16 వేల మంది అర్చకులను ఏర్పాటు చేశారని, నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్చకులకు పెద్దపీట వేశారని, జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క బ్రాహ్మణ వర్గానికే కాకుండా అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్, నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు కె.రాఘవాచార్యులు, రాజరాజేశ్వరి దేవస్థానం అర్చకులు కె.రాధాకృష్ణమూర్తి, సీతానగరం శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానం అర్చకులు శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఈమని విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం ఝాన్సీ, పూర్వ హెచ్ఎం ఎం.ఏడుకొండలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.ఎస్. ఝాన్సీ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈమని పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన పోకూరి నిశ్రియ శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి, ద్వితీయ స్థానం సాధించిన ముత్తే పావని ఒంగోలు ట్రిపుల్ ఐటీకి, పెరికలపూడి కీర్తన నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థినులను పూర్వ ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు, పాఠశాల కమిటీ చైర్మన్ బి.కోటయ్య, సభ్యులు, సర్పంచ్ ఉజ్వల హరిణి, గ్రామపెద్దలు, ఇ.విష్ణుమూర్తి, లోకల్ పూర్ణ చంద్రరావు తదితరులు అభినందించారు.

మందుబాబుల నుంచి ప్రాణహాని

ప్రాణ రక్షణ కల్పించాలని దంపతుల వేడుకోలు

మంగళగిరి: తమకు కొందరు మందుబాబుల నుంచి ప్రాణ హాని ఉందని, ప్రాణ రక్షణ కల్పించాలని ఓ బాధిత కుటుంబం మంగళగిరి రూరల్ పోలీసులను ఆశ్రయించింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు...బాపట్ల జిల్లా కొండభొట్లవారిపాలెం గ్రామానికి చెందిన పసుమర్తి వెంకటేశ్వరరావు, రత్నకుమారి దంపతులు బతుకుదెరువు నిమిత్తం కొన్నేళ్లుగా యర్రబాలెం దళితవాడలో నివసిస్తున్నారు. వెంకటేశ్వరరావు తాపీ కార్మికునిగా పనిచేస్తుండగా భార్య కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 9న సాయంత్రం 6.30 సమయంలో వెంకటేశ్వరరావు నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా క్రైస్తవ శ్మశానవాటిక వద్ద మద్యం, గంజాయి సేవిస్తున్న కొందరు యువకులు మత్తులో ఆయనపై రాళ్లు విసిరి గాయపర్చారు. అదే ప్రాంతానికి చెందిన దొడ్డా ప్రదీప్‌తోపాటు మరో గుర్తు తెలియని యువకుడు వారి ఇంటి వద్దకు వచ్చి మరోమారు భార్యాభర్తలపై దాడికి పాల్పడటమే కాకుండా చంపేస్తామని బెదిరించి వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి బాధితులు మంగళగిరి రూరల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు దొడ్డా ప్రదీప్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. తమపై దాడికి పాల్పడి గాయపర్చడమే కాకుండా చంపేస్తానంటూ బెదిరించిన ప్రదీప్‌ను రూరల్ పోలీసులు విచారించకుండానే మొక్కుబడిగా కేసు నమోదు చేసి గంటల వ్యవధిలోనే వదిలివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవ సమాధుల వద్ద ప్రతి రోజూ కొందరు యువకులు మద్యంతోపాటు గంజాయి కూడా సేవిస్తున్నారని, గంజాయి మత్తులోనే ప్రదీప్ తమపై దాడి చేసి గాయపర్చినా రూరల్ పోలీసులు పెట్టీ కేసు నమోదు చేసి పంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు మంగళగిరి రూరల్ పోలీసులు న్యాయం చేయాలన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గుంటూరు భారత్‌పేటలోని నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సామాన్యుడికి జవాబుదారీ పాలన అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, జల జీవన్ మిషన్ ద్వారా కొనసాగుతున్న వర్క్‌లు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు. జగనన్న కాలనీలలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి వీలైనంత త్వరలో లబ్ధిదారులు గృహ ప్రవేశం అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో వరివిత్తనాలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు సబ్సిడీపై అందించనున్నామని దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి పి. శిరీష అన్నారు. శుక్రవారం దుగ్గిరాల వ్యవసాయ కార్యాలయంలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న సందర్భంగా వరి పంట వేసుకునే రైతులకు ప్రతి గ్రామంలోనూ ఆర్‌బికె సెంటర్ లలో వరి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వరి పంటతో పాటు గట్లపై నాటుకొనుటకు కంది విత్తనాలు ఉచితంగా అందజేయనున్నామని వివరించారు. కౌలు వ్యవసాయం చేసే ప్రతి రైతుకు సీసీఆర్‌సీ కార్డులు అందజేస్తామని, రైతులు సమీప ఆర్‌బికె సెంటర్లలో సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ వనిత, ఏఎబీ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, దుగ్గిరాల ఏఈఓ ఎ.రమేష్‌బాబు, ఏఏబీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళలకు చంద్రబాబు పరామర్శ

తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ సమీపంలో సీతానగరం వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు మహిళలు శుక్రవారం అదుపుతప్పి కిందపడిపోయారు. ఇందులో ఓ మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. అప్పుడే మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు అమరావతి కరకట్టపై ఉన్న తన ఇంటి వద్ద నుంచి ఆత్మకూరులో ఉన్న పార్టీ కార్యాలయానికి వెళ్తున్నారు. ఆ ప్రమాదాన్ని గమనించిన ఆయన కారు ఆపి గాయపడిన మహిళను పరామర్శించారు. ఆయన కాన్వాయ్‌లో ఉన్న డాక్టర్ చేత ప్రథమ చికిత్స చేయించి ఇద్దరు మహిళలను వేరే కారులో ఆసుపత్రికి పంపించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

తాడికొండ: తాడికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అత్తోట దీప్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు విధిగా హాజరు కావాలని, మండల స్థాయి అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

రేపు చౌడేశ్వరి అమ్మ జయంతి

మంగళగిరి: దేవాంగ కుల దేవత చౌడేశ్వరి అమ్మ వారి జయంతి కార్యక్రమం ఆదివారం ఆషాఢ అమావాస్య సందర్భంగా నిర్వహించనున్నట్లు అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అల్లక తాతారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4గంటలకు నగరంలోని కొప్పురావుకాలనీ నుంచి కలశ బోనాలతో, మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి గండాలపేటలో వేంచేసియున్న తోతాద్రి పోలేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తామని, దేవాంగ కుల బాంధవులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

రేపు మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళీ అమ్మవారికి ఆదివారం బోనాల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆషాఢ మాసం నాల్గవ ఆదివారాన్ని పురస్కరించుకుని ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని, భక్తులు స్వచ్ఛందంగా పాల్గొని అమ్మ వారి కృపాకటాక్షలు పొందగలరని కోరారు.

ఆధ్యాత్మికతతోపాటు ఆహ్లాదకరంగా ఉండాలి

- 17న గండాలయస్వామి కొండపై మొక్కలు నాటే కార్యక్రమం
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



కొండపై మొక్కలు నాటే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: ఆధ్యాత్మికతతోపాటు ఆహ్లాదాన్ని అందించేలా గండాలయస్వామి కొండను తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులకు సూచించారు. గండాలయస్వామి కొండపై స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు ఆహ్లాదకర వాతావరణంలో ప్రశాంతంగా సేదతీరేలా కొండపైన పూర్తి స్థాయిలో మొక్కలు నాటి పెంచాలన్నారు. శుక్రవారం కొండపై మొక్కలు నాటే ప్రదేశాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే అధికారులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గండాలయస్వామి కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరచడంతోపాటు ఆధ్యాత్మికతను భక్తులు అనుభవించేలా అభివృద్ధి చేయాలన్నారు. కొండంతా పచ్చదనంతో ఉండేలా ఈ నెల 17వ తేదీన మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు.

ఆలయ ఆస్తుల పరిరక్షణతోపాటు ఆదాయం పెంచడమే లక్ష్యం

నగరంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి ఆస్తులు పరిరక్షించడంతోపాటు వాటి ద్వారా ఆలయానికి ఆదాయం పెంచడమే లక్ష్యమని ఎమ్మెల్యే ఆర్కే పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ, కమిషనర్ యు శారదాదేవిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నృసింహస్వామి ఆలయానికి చెందిన భూములు కౌలుకు తీసుకుని ఆలయానికి కౌలు చెల్లించకపోగా కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేస్తున్నారన్నారు. కొందరు భూములను అన్యాక్రాంతం చేయాలని చూస్తున్నారన్నారు. భూములను ప్రజావసరాల నిమిత్తం నగరపాలక సంస్థ లీజుకు తీసుకుని భవనాలు నిర్మించి వినియోగించుకోవడంతోపాటు ఆలయానికి లీజు రూపంలో ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆర్కే కోరారు. భూములు అన్యాక్రాంతం కాకుండా చూడడంతోపాటు ఆలయానికి ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘కథ చెబుతారా–ఊ కొడతాం’ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు

మంగళగిరి: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన గుంటూరు నగరంలోని రాజాగారితోట టీటీడీ కల్యాణ మండపంలో చిన్నారులకు నిర్వహించతలపెట్టిన ‘కథ చెబుతారా– ఊ కొడతారా’ కాంపిటీషన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం నగరంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థాన ఆవరణలో ఆవిష్కరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా సమన్వయకర్త, ధార్మిక కమిటీ గుంటూరు జిల్లా సభ్యులు మాజేటి సూర్యవేణు గోపాలకృష్ణ శ్రేష్టి మాట్లాడుతూ కథ చెబుతారా–ఊ కొడతాం అనే చక్కటి కార్యక్రమానికి సంబంధించి 10, 15 సంవత్సరాలలోపు పిల్లలకు రెండు గ్రూపులుగా కాంపిటీషన్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా నీతి బోధన, ఆధ్యాత్మిక కథలు, తల్లిదండ్రులు, గురువులు, దేవతలు, పురాణ ఇతిహాసాలపై చిన్నారులు ఎంచుకున్న సబ్జెక్టుపై నాలుగైదు నిమిషాలలోపు చక్కటి సందేశాత్మకంగా ఉండే కార్యక్రమం రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ధార్మిక కమిటీ గుంటూరు జిల్లా సభ్యులు ఆలేటి నాగలక్ష్మి, గాదంశెట్టి సుజాత, తుళ్లూరు సుజాత, నాగుబండి కుమారస్వామి, దామర్ల వెంకటేశ్వరరావు, మద్ది అనిల్‌కుమార్, ఆళ్ల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ఆర్ నేటి తరం నటులకు ఆదర్శం



సీఎస్‌ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: రంగస్థల నటుడు చిలకలపూడి సీతారామాంజనేయులు (సీఎస్‌ఆర్) జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సీఎస్‌ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హాబీ క్లబ్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆర్.సుభాకరరాజు మాట్లాడుతూ సీఎస్‌ఆర్ నేటి తరం నటీనటులకు ఆదర్శమన్నారు. మాయాబజార్ సినిమాలో శకుని పాత్రతో తెలుగు వారి మనసులను దోచుకున్నారని అన్నారు. పలు పౌరాణిక చిత్రాలలో ఆయా పాత్రలను పోషించి నటనకు వన్నె తెచ్చిన మహానుభావుడని అన్నారు. అభినయ్ క్లబ్ నట శిక్షకులు వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ పాచికలతో పాండవులను అడవులకు పంపిన దృశ్యాన్ని తలచుకోగానే కళ్లముందు కదలాడే వ్యక్తి సీఎస్‌ఆర్ అని గుర్తు చేశారు. అనంతరం వి.గోపాలకృష్ణమూర్తి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతురమ్య, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీని సాగనంపాలి

సీపీఎం నాయకులు జేవీ రాఘవులు



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు జేవీ రాఘవులు

మంగళగిరి: ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న భారతీయ జనతాపార్టీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం సీనియర్ నాయకులు జేవీ రాఘవులు అన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం పార్టీ విస్తృత సమావేశం వీవీ జవహర్‌లాల్ అధ్యక్షతన నిర్వహించారు. రాఘవులు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో దేశం అభివృద్ధి చెందలేదని విమర్శించారు. కామన్ సివిల్ కోడ్‌ను అత్యధిక పార్టీలు వ్యతిరేకించినప్పటికీ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి చట్టం చేయడానికి బీజేపీ పూనుకుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ బీజేపీ కులాలు, మతాల మధ్య విబేధాలు సృష్టించి రానున్న ఎన్నికల్లో పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. మణిపూర్‌లో ఘర్షణలకు బీజేపీయే కారణమన్నారు. ఏపీలోని అధికార, ప్రతిపక్షపార్టీలు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని విమర్శించారు. విద్యుత్, ఆయిల్ ధరలు పెంచడంతో పాటు అనేక సంస్కరణలు కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్నా వైఎస్సార్ సీపీ, టీడీపీ మద్దతు తెలియజేస్తున్నాయని అన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు పి బాలకృష్ణ, వై కమలాకర్ పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ వర్క్‌లు డ్వాక్రా మహిళలకు కేటాయిస్తాం



మాట్లాడుతున్న జల్‌జీవన్ మిషన్ డీపీఎంయూ పీఎం పి కిరణ్

పొన్నెకల్లు(తాడికొండ): డ్వాక్రా సంఘాలు, గ్రామ సమాఖ్యలకు జల్‌జీవన్ మిషన్ వర్క్‌లు దాదాపు రూ.85 లక్షల వరకు కాంట్రాక్టు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆసక్తి ఉన్న మహిళా సంఘాలు ముందుకు రావాలని జల్‌జీవన్ మిషన్ డీపీఎంయూ పీఎం పి కిరణ్ తెలిపారు. శుక్రవారం తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో జల్‌జీవన్ మిషన్‌పై డ్వాక్రా మహిళలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రభుత్వం గ్రామాల్లో తాగునీటి వసతి కల్పించి ఇంటింటికీ నీటిని అందించేందుకు లక్షలాది రూపాయలు కేటాయించిందని, ఈ పనుల నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించడం జరుగుతుంది కనుక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొన్నెకల్లు గ్రామంలో రూ.85 లక్షల వరకు నిధులు మంజూరు జరిగాయని, బిల్లుల చెల్లింపు ప్రక్రియ కూడా వెంటనే జరుగుతుంది కనుక అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జల్‌జీవన్ మిషన్ అధికారులు తేజ్ సంగీత్, ఐఎస్ఏ లక్ష్మణ్, ఏపీఎం సాంబశివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.